గురువారం-

సాయిబాబా గుడి భక్తులతో నిండివుంది.

దేవుడి దర్శనం చేసుకుని, బయటకి వచ్చిన శేఖర్‌కి రాధిక కనబడింది.

"హలోఁ..!" అన్నాడు పలకరింపుగా.

"హలో..!" అంది నిర్లిప్తంగా.

"రండి... అలా కూర్చుందాం! మీతో ఒక నిమిషం మాట్లాడాలి!" అన్నాడు.

అయిష్టంగానే అతన్ని అనుసరించింది. గుడి ప్రక్కనే ఉన్న చెట్ల క్రిందికి వెళ్లి కూర్చున్నారు.

"మీ అమ్మగారు విషయం చెప్పారనుకుంటాను. మీరేం నిర్ణయించుకొన్నారు?" అన్నాడు శేఖర్.

"జీవితాలతో ఆడుకునేవాళ్ళతో జీవితం పంచుకోనని చెప్పాను!"

శేఖర్ ముఖం తెల్లగా పాలిపోయింది. ఆమెతో ఏమీ మాట్లాడలేకపోయాడు.

రాధిక "నేను వస్తాను!" అంటూ లేచి గుడిలోకి వెళ్లిపోయింది.

శేఖర్ అలాగే కూర్చుండిపోయాడు... ఆమె వెళ్లిన వైపే చూస్తూ.

• • •

గుడిలో శేఖర్‌ని కలిసిన విషయం సురేష్‌తో చెప్పింది రాధిక.

"నా మాటలు విని అతను బాధపడుతూంటే నాకు కసి తీర్చుకున్నానన్న సంతోషం కలిగింది!" అంది.

"తప్పమ్మా! నువ్వు అలా అని ఉండకూడదు. రాధీ! అతను పెళ్ళి ప్రపోజల్ తెస్తే అతను నీకు తగినవాడా, కాదా అనే ఆలోచించాను. కాని, ఇప్పుడు చెప్తున్నాను... నువ్వే అతనికి తగవు. అతను చేసిన తప్పల్లా- లంచం తీసుకోవడం! అదీ ఇప్పుడు మానేశాడు. చేసిన తప్పుకి అతను ఎంతగా ఫీలవుతున్నాడో మనం చూస్తూనే వున్నాం. ఇంకో విషయం తెలుసా? తను ఆర్జించిన సొమ్మంతా సాయిబాబా గుడిలో అన్నదాన పథకానికి ఇచ్చేసి, కొత్తజీవితాన్ని ప్రారంభించానని చెప్పాడు. అటువంటి మంచిమనిషికి నువ్వు తగవు. అతని శ్రేయోభిలాషిగా నేనీ మాట చెప్తున్నాను. మనం వేరే సంబంధం చూసుకుందాం!"

షాక్ తిన్నట్లు చూస్తూండిపోయింది రాధిక. తనను ఎంతో ప్రేమించే అన్నయ్య అలా మాట్లాడతాడని ఆమె ఊహించలేదు. అలా మాట్లాడాడంటే తప్పు తనలో ఉంది.

ఆమెలో ఆలోచన మొదలైంది.

• • •

రాధిక ఆరోజు సాయంత్రం సాయిబాబా గుడికి వెళ్ళేసరికి పూజారితో మాట్లాడుతూ కనిపించాడు శేఖర్.

రాధికని చూసినా పలకరించలేదతను.

అతడు వెళ్లిపోయాక పూజారిని సమీపించి, "ఏమిటి బాబాయ్... అలా ఉన్నారు?" అని అడిగింది.

